# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఉభయ తెలుగు రాష్ట్రాల సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ గడువు ఈరోజుతో ముగిసింది.
- భారత్ ను 2047 నాటికి అన్ని విధాలా అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని బీజేపీ నాయకులు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు.
- సింహాచలం శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జీవీఎంసీ కమిషర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులకు ఆదేశించారు.
- రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వడగాడ్పులు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

==============================

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ గడువు ఈరోజుతో ముగిసింది. అభ్యర్థుల తుది జాబితాను రిటర్నింగ్ అధికారులు విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాలకు మొత్తం 4 వేల 210 నామినేషన్లు, 25 లోక్‌సభ నియోజకవర్గాలకు 731 నామినేషన్లు దాఖలయ్యాయి. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు గానూ 625 నామినేషన్లు నమోదయ్యాయి. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

==============================

ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించిందని, త్వరలో మూడవ స్థానాన్ని సాధిస్తామని బీజేపీ నాయకులు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖలోని ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వికసిత్ భారత్ అంబాసిడర్స్ క్యాంపస్ డైలాగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2014లో భాతరదేశం ఆర్థికంగా పదో స్థానంలో ఉండేదని, 10 ఏళ్ల తర్వాత ప్రస్తుతం ఐదవ

స్థానానికి చేరుకుందన్నారు. 2047 నాటికి అన్ని విధాలా అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశాన్ని నిలబెట్టేందుకు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. చిరు వ్యాపారస్థులు సైతం డిజిటల్ లావాదేవీలు చేయడంతో దేశం పురోగతి సాధించిందని ఆమె పేర్కొంటూ ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

ఆంధ్రప్రదేశ్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దక్షిణ, నైరుతి దిశ నుంచి వీస్తున్న పొడిగాలుల కారణంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వడగాడ్పుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. రేపు 61 మండలాలలో తీవ్ర వడగాడ్పులు, 159 మండలాలలో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు అధికంగా నమోదు అవుతాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

==============================

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులందరూ సమిష్టిగా విధులు నిర్వహించాలని మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. మే 10వ తేదీన జరుగబోయే చందనోత్సవ కార్యక్రమంపై ఈరోజు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చందనోత్సవానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ సారించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అన్నారు. అవసరమైనచోట్ల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గోశాల, తొలిపావంచ నుండి అడవివరం వరకు చేపట్టిన అభివృద్ధి పనులను, అలాగే మిగిలిన అన్నీ పనులను మే 8వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

==============================

ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి జిల్లా చోడవరం మండలం కొత్తూరు జంక్షన్ లో జరిగిన “మేమంతా సిద్ధం” సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తును నిర్ణయించేవి ఎన్నికలే అని, అభివృద్ధి-సంక్షేమాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఓటేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వస్తే పథకాలు యదావిధిగా కొనసాగుతాయని అన్నారు. అదేవిధంగా గుంటూరు జిల్లా పొన్నూరులో జరిగిన రోడ్ షోలో పాల్గొన్న ఆయన తమ ప్రభుత్వ 58 నెలల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చామని అన్నారు.

విరామం

==============================

ఈ రోజు రాత్రి 7 గంటల 10 నిమిషాలకు విశాఖపట్నం నుంచి బయలుదేరాల్సిన
విశాఖపట్నం-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా అంటే రాత్రి 11 గంటల 10 నిమిషాలకు బయలుదేరుతున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. దీనిజత రైలు ఆలస్యంగా నడుస్తోన్న కారణంగా రీషెడ్యూల్ చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాల్సిందిగా కోరారు.

==============================

ఆకాశవాణి విశాంత్ర సహాయ స్టేషన్ డైరెక్టర్ మహమూద్ ఖాన్ ఈ రోజు మధ్యాహ్నం మరణించారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఉద్యోగిగా సర్వీసును ప్రారంభించి అనంతరం కొత్తగూడెం, విశాఖపట్నం, అనంతపురం, తదితర కేంద్రాలలో అనేక పదవులలో ఆకాశవాణికి సేవలు అందించారు. ముఖ్యంగా వాణిజ్య ప్రసార విభాగంలో ఎక్కువ కాలం కార్యక్రమ నిర్వహణ అధికారిగా సేవలు అందించారు. మహమూద్ ఖాన్ చివరిగా అనంతపురంలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ గా 2002వ సంవత్సరంలో పదవి విరమణ చేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ రోజు మధ్యాహ్నం మృతి చెందారు. మహమూద్ ఖాన్ మృతి పట్ల ఆకాశావాణి అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

==============================

సార్వత్రిక ఎన్నికల నేపద్యంలో ఎన్నికలు కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా 13.96 కోట్ల రూపాయల నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేశామని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఈరోజు ఏలూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ /ఎన్ కోర్ ద్వారా అందిన 2 వేల 255 అభ్యర్థనలలో ఇంతవరకూ 2 వేల 162 అనుమతులు జారీ చేయగా మరో 93 పరిశీలనలో ఉన్నాయన్నారు. సి-విజిల్ ద్వారా 439 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున్న ప్రజలు నగదు లేదా ఇతర విలువైన వస్తువులు ప్రయాణంలో తీసుకువెళ్ళే సమయంలో అందుకు సంబంధించి సరైన ఆధార పత్రలను తమ వద్ద ఉంచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

==============================

రాష్ట్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులకు సంబందించి వ్రాత పరీక్షను జూన్ 10, 11, 12 తేదీల్లో నిర్వహిస్తామని ఉపాధి శిక్షణా శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జూనియర్ ఇంజినీరింగ్ పరీక్షలు ఉన్న కారణంగా జూన్ 6 నుండి ప్రారంభించవలసిన ఈ వ్రాత పరీక్షల తేదీలను మార్పు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ పోస్టులకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్షల తేదీ మార్పులను గమనించగలరని కోరారు. పూర్తి వివరాలను employment.ap.gov.in వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు తెలియజేశారు.

==============================

ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల నేపధ్యంలో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన కూటమి మ్యానిఫెస్టోను రేపు విడుదల చేయనుంది. మధ్యాహ్నం 12 గంటలకు ఉండవల్లిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మూడు పార్టీల నేతలు దీన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్యనేతలు పాల్గొననున్నారు.

==============================

ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ కళాశాలల్లో వివిధ లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్, పీజీ లా సెట్ దరఖాస్తు గడువును పెంచినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశానికి ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా మే 4 వరకు గడువును పొడిగిస్తున్నట్లు తెలిపారు. 500 రూపాయల ఆలస్య రుసుంతో మే 11 వరకు, 3 వేల రూపాయలతో ఆలస్య రుసుంతో మే 29 వరకు దరఖాస్తుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తుల సవరణకు మే 30 నుంచి జూన్ 1 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

==============================

విజయనగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి గాను 1 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జె.దయానంద తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశం కోరే బాలబాలికలు వినికిడి లోపం ఉన్నట్టు ధ్రువపత్రం, జనన, కుల ధ్రవపత్రం, పాఠశాల బదిలీ సర్టిఫికెట్‌లతో పాటు రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు అకౌంట్ పాస్‌పుస్తకం మొదటి పేజీ జిరాక్సు ప్రతితో పాఠశాలలో సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన మూగ చెవిటి బాల, బాలికలు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు.

==============================

==============================